సాక్షి
మంచిర్యాల
శనివారం, 16, నవంబర్, 2024


గూడెం సత్యదేవుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు


సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్


గూడెంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు


విశ్వనాథ ఆలయంలో జ్వాలాతోరణం


గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నోముతున్న భక్తులు


గూడెంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


విశ్వనాథ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తిక.. జాతర

- గూడెంలో పోటెత్తిన భక్తులు
- 1490 సామూహిక సత్యనారాయణవ్రతాలు

దండేపల్లి/మంచిర్యాలఅర్బన్: కార్తిక పౌర్ణమి జాతర సందర్భంగా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయానికి శుక్రవారం భక్తజనం పోటెత్తింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాల నుంచి భారీసంఖ్యలో తర లి రావడంతో సందడిగా మారింది. ఘాట్ రోడ్డు గుండా ప్రధాన ఆలయం వరకు క్యూలైన్లలో భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరి సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సింహద్వారం నుంచి మెట్ల దారి వరకు, ఘాట్ రోడ్డు మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయాయి. సన్నిధి సమీపంలోని రావిచెట్టు వద్ద భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. 1490 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, వరంగల్ జైళ్ల శాఖ డీఐజీ సంపత్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు స్వామి వారిని దర్శించుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ దంపతులు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ దంపతులు సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగ తం పలుకగా, అర్చకులు ఆశీర్వచనం చేసి ప్రసాదా లు అందించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది, లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సైలు, సుమారు 200 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తులు గూడెం గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గంగమ్మతల్లికి పూజలతోపాటు కార్తిక దీపాలను నదిలో వదిలారు. నదివద్ద స్నానాలు చేసే మహిళా భక్తులకు సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురయ్యారు. మంచిర్యాల పట్టణంలోని ఆలయాలన్ని భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయాయి. ధ్వజస్తంభాలు, ఉసిరిచెట్ల వద్ద దీపారాధనలు చేసి తరించారు. స్థానిక విశ్వనాథ ఆలయంలో వెంకటేశ్వరస్వామి, శివాల యం, వాసవి కన్యకపరమేశ్వరి మాతాను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శివలింగానికి పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.


శివలింగానికి భక్తుల అభిషేకం

న్యూస్‌రీల్

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం


డీఎం జనార్దన్

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తామని మంచిర్యాల డిపో మేనేజర్ జనార్దన్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంలో ప్రయాణికుల సమస్యలు విని పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. మియాపూర్ నుంచి మంచిర్యాలకు సాయంత్రం 6గంటలకు బస్సు సర్వీసు నడిపించాలని నరేందర్ కోరగా పరిశీలిస్తానని డీఎం అన్నారు. మందమర్రికి చెందిన సుధాకర్ మంచిర్యాల నుంచి వచ్చే బస్సులను మందమర్రి మార్కెట్ బస్టాండ్ వరకు వచ్చేలా చూడాలని సూచించగా.. మంచిర్యాల డిపో బస్సులు రెండు నడుస్తున్నాయని చెప్పారు. మునిమడుగుకు చెందిన రాంచంద్రారెడ్డి వేములవాడ వయా జన్నారం కలమడుగు, జగిత్యాల వరకు బస్సులు నడిపాలని కోరగా ప్రయత్నిస్తానని అన్నారు. బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్ కాళేశ్వరం నుంచి బెల్లంపల్లి కాంటా వరకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించగా.. పరిశీలిస్తామని తెలిపారు. వేమనపల్లి, కన్నెపల్లి, బెల్లంపల్లి బస్సు పునరుద్ధరించాలని సంతోష్, నాగసతీష్‌కుమార్ డీఎం దృష్టికి తీసుకు రాగా రూట్ సర్వే చేసి బస్సు నడిపిస్తామని చెప్పారు. హైటెక్ కాలనీ మంచిర్యాలకు చెందిన రాజేశ్ సాయంత్రం 8గంటలకు నిర్మల్ నుంచి మంచిర్యాలకు బస్సు సర్వీసు వేయాలని, బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్ బెల్లంపల్లి దేవాపూర్‌కు బస్సు నడిపించాలని కోరగా సానుకూలత వ్యక్తం చేశారు. ఆయా రూట్లలో సర్వే చేసిన అనంతరం బస్సులు నడిపిస్తామని డీఎం తెలిపారు.

'అనర్హులైన గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వద్దు'


మాట్లాడుతున్న రవీందర్

తాండూర్: అనర్హులైన గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వడం ఏమాత్రం సరికాదని కొలవార్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండిగ రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడిగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడానికి సతాయించిన అధికారులు గిరిజనేతరులను అర్హులుగా ఎలా గుర్తించారో చెప్పాలని ప్రశ్నించారు. గిరిజనేతరులను గిరిజనులుగా చూపించి అక్రమాలకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశారు. వారి పట్టాలను రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు ఊరడి మహేష్, మాజీ సర్పంచ్ మణికుమార్, నాయకులు చిలకయ్య, చిన్నయ్య, ప్రవీణ్, హన్మంతు, రాజయ్య పాల్గొన్నారు.

20న కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు

మంచిర్యాలటౌన్: ఈ నెల 20న గాంధీభవన్‌లో నిర్వహించే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హఫీజ్, వై.రాజన్న, ఇందూరి గట్టయ్య, కోవ జంగు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు చిక్కులు


హాజీపూర్ మండలం వేంపల్లిలో దరఖాస్తుల పరిశీలన చేస్తున్న కార్యదర్శి ప్రతిభ

- నత్తనడకన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ
- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు
- దరఖాస్తుదారుల నుంచి స్పందన అంతంతే..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్‌ఆర్‌ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిష్కారానికి మోక్షం లభించినా క్షేత్రస్థాయి పరిశీలనలో చిక్కులు ఎదురవుతున్నాయి. పరిశీలనకు వెళ్తున్న అధికారులకు అనేక ఇబ్బందులతోపాటు దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్ నమోదులో సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వ భూముల రెగ్యులర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎక్కువగా ఉండడం, క్షేత్రస్థాయి పరిశీలనలో దరఖాస్తుదారులు సహకరించకపోవడం వంటి వాటితో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 16మండలాలు, 311 గ్రామ పంచాయతీల్లో 15,729, ఏడు మున్సిపాల్టీల్లో 39,512 దరఖాస్తులు వచ్చాయి. అప్పటి నుంచి పరిశీలనకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణకు ఆమోదం తెలపడంతో కదలిక వచ్చింది.

పంచాయతీల్లో..

గ్రామ పంచాయతీల్లో 15,729 దరఖాస్తులకు గాను 2,138 పరిశీలనకు అధికారులు అనుమతి ఇచ్చారు. 2,533 నిషేధిత జాబితాలో చేర్చగా.. 9,977 పరిశీలించాల్సి ఉంది. 2,138 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్‌కు ఆమోదం లభించినా ఫీజు చెల్లించడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇక ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్, మీ సేవ కేంద్రాల్లో రూ.వెయ్యి చెల్లించి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ రశీదుతోపాటు డాక్యుమెంట్, లింక్ డాక్యుమెంట్, ఈసీ, సేల్‌డీడ్ ఇతర పత్రాలు జత చేయాలి. ఇక అక్రమ లే అవుట్ ప్లాట్ క్రమబద్ధీకరణకు చెల్లించిన రూ.10 వేల రశీదుతోపాటు సేల్‌డీడ్ పత్రాలు, ఈసీ, వెంచర్ ప్లాన్ తదితర పత్రాలు జత చేయాల్సి ఉంటుంది.

ఫోన్ చేసినా స్పందన లేదు

దరఖాస్తుల పరిశీలన మొదటి దశలో ఉంది. గతంలో నామమాత్రంగా చేసి అనుమతులు ఇచ్చినా ప్రస్తుతం జియో ట్యాగింగ్ చేయాల్సి వస్తుండడంతో పరిస్థితులు భిన్నంగా మారాయి. అధికారులు ఫోన్ చేసినా కొందరు దరఖాస్తుదారులు పరిశీలనకు రావడం లేదు. ఇతరులకు ప్లాట్లను విక్రయించడంతో అలాంటి వారికి ఫోన్ చేసినా స్పందించడం లేదు. సరైన పత్రాలు ఇవ్వకపోవడంతో ప్లాట్ల గుర్తింపు సిబ్బందికి కొంత కష్టంగా మారుతోంది. మరికొందరు దూరప్రాంతాల్లో ఉండి బల్దియాలు, పంచాయతీల్లో ప్లాట్లు కొనుగోలు చేసుకోగా ఎల్‌ఆర్‌ఎస్‌కు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

మూడు దశల్లో ప్రక్రియ..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలిస్తున్నారు. మొదటి దశలో గ్రామ కార్యదర్శి, గిర్దావర్, నీటి పారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే దరఖాస్తులను లాగిన్(ఎల్)–2కు పంపిస్తారు. పంచాయతీల్లో డీపీఓ, మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అన్నీ సరైన విధంగా ఉంటే ఫీజు చెల్లించేలా దరఖాస్తుదారుడి మొబైల్‌కు మెస్సేజ్ వెళ్తుంది. ఫీజు చెల్లించిన తర్వాత దరఖాస్తు ఎల్–3కి వెళ్తుంది. అదనపు కలెక్టర్ పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఆమోదానికి పంపించి ఆ భూమిని క్రమబద్ధీకరిస్తారు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎల్–2 వరకు అంతంత మాత్రంగా చేరుతుండగా.. ఎల్–3వరకు చేరడం లేదు.

వేగవంతం చేస్తున్నాం..

దరఖాస్తుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో వేగవంతంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. దరఖాస్తుదారులకు రోజువారీగా ఫోన్లు చేయిస్తూ సర్వే ప్రక్రియ ఆగకుండా చూస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు రోజూ సర్వేలో భాగంగా దరఖాస్తులను పరిశీలించి ఎల్–1 నుంచి ఎల్–2 లాగిన్‌కు పంపించేలా పర్యవేక్షణ చేస్తున్నాం. ఫీజులు చెల్లించేలా చైతన్యం చేస్తున్నాం. జిల్లాలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిశీలన జరిపించి పూర్తి చేస్తాం.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

దరఖాస్తుల వివరాలు..

	వచ్చినవి	పరిశీలించినవి	నిషేధించినవి	పరిశీలించాల్సినవి
16 మండలాలు	15,729	2,137	2,533	9,977
7 మున్సిపాలిటీలు	39,512	17,516	9,562	12,434

పట్టుదలగా 'కొలువు'దీరారు..

నిరుపేదలు.. వ్యవసాయ కుటుంబం.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు మరికొందరు.. అయితేనేం.. పట్టుదలగా చదివి గ్రూప్–4 ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి శభాష్ అనిపించుకున్నారు. టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన జిల్లా వాసులపై ప్రత్యేక కథనం.


అగ్గు స్వాతి


కొట్టె సాయికిరణ్

కోటపల్లి/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లి: కోటపల్లి మండలం సుపాక గ్రామానికి చెందిన అగ్గు సత్తయ్య, పద్మ దంపతుల కూతురు స్వాతి ప్రతిభ కనబర్చి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన స్వాతి విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలోనే సాగించింది.

- కోటపల్లికి చెందిన కొట్టె సాయికిరణ్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు రాసినా కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం పొందలేదు. నిరాశ చెందకుండా గ్రూప్–4 పరీక్ష రాసి వార్డు ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం గ్రూప్–3 పరీక్షకు సిద్ధమవుతున్నాడు.
- కోటపల్లి మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన చేతన్ బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ చదివించాడు. చేతన్ ప్రస్తుతం మండలంలోని జనగామ గ్రామంలో పోస్టల్ డిపార్టుమెంట్‌లో బీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు.
- చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన బుర్ర శ్రీకాంత్‌గౌడ్ ఐటీడీఏలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు.
- బెల్లంపల్లి మండలంలోని మాల గురిజాల గ్రామానికి చెందిన గోనే శశికుమార్ ఉద్యోగం సాధించాడు. బీటెక్ పూర్తి చేశానని, రోజుకు 8గంటలపాటు చదివానని తెలిపాడు.

లక్సెట్టిపేట: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన కూడెల్లి తేజకళ్యాణి వార్డు ఆఫీసర్ ఉద్యోగం సాధించింది.

యువరైతు 68వ ర్యాంకు


లాకవత్ రాజు

జన్నారం: మండలానికి చెందిన ఏడుగురు యువకులు ఉద్యోగాలు సాధించారు. మండలంలోని కవ్వాల్ హాస్టల్ తండా గ్రామానికి చెందిన యువరైతు లాకవత్ రాజు జిల్లా స్థాయిలో 68వ ర్యాంకు సాధించాడు. రేండ్లగూడ గ్రామానికి చెందిన మామిడిపెల్లి రామన్ జిల్లాస్థాయి 223వ ర్యాంకు సాధించాడు. పొనకల్‌కు చెందిన నగూరి అనిల్‌కుమార్, మహ్మదబాద్‌కు చెందిన జాడి రాజతిరుపతి, మురిమడుగు గ్రామానికి చెందిన ఎలగందుల మధుకర్, దేవునిగూడ గ్రామానికి చెందిన సింగిరెడ్డి రణదీప్‌రెడ్డి, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుక్కటికారి దుర్గప్రసాద్ ఉద్యోగం సాధించారు.

దండేపల్లిలో..

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ టీచర్ పాత రమేష్, కేసరి దంపతుల ఇద్దరు కుమారులు దినేష్, విష్ణువర్ధన్ హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించారు. బొలిశెట్టి సచిన్‌రాహుల్ ఆడిట్ అండ్ జనరల్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, మధు ట్రెజరీలో జూనియర్ అసిస్టెంట్‌గా, మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన అయ్యోరు శ్వేత విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించారు.

అక్కాచెల్లెలు


ధరణి అమూల్య, అలేఖ్య

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలోని పాతమంచిర్యాలకు చెందిన ధరణి రాంచందర్, అనిత దంపతుల ఇద్దరు కూతుళ్లు ఉద్యోగాలు సాధించారు. రాంచందర్ మందమర్రి మండలం అందుగులపేట సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తూ కూతుళ్లను పీజీ వరకు చదివించారు. పెద్ద కూతురు అలేఖ్య నిజాం కాలేజీలో ఎంకాం, చిన్న కూతురు అమూల్య ఓయూ క్యాంపస్‌లో ఎమ్మెస్సీ ఇటీవలే పూర్తి చేశారు. మొదటిసారి రాసిన పరీక్షలో ఉద్యోగాలు సాధించారు. అలేఖ్య జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో, అమూల్య మున్సిపల్ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికయ్యారు. ఇద్దరూ ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రుల్లో ఆనందం నెలకొంది.

- మంచిర్యాల పట్టణంలోని మేదరివాడకు చెందిన నీలం వెంకటేశ్ మున్సిపాలిటీలో జూనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగం సాధించాడు. 2018లో తండ్రి భీమయ్య మృతిచెందగా.. తల్లి మధునక్కకు అండగా ఉండి పనులు చేసుకుంటూ ఎంబీఏ చదివాడు. శిక్షణ పొంది గ్రూప్–2 రాసినా ఫలితం లేకపోయింది. ఇంట్లోనే ఉంటూ పరీక్షకు సన్నద్ధమై గ్రూప్–4 ఉద్యోగం సాధించాడు.

గిరిజనుల అభివృద్ధికి 'ఉత్కర్ష్ అభియాన్'


అధికారులు, విద్యార్థులతో కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- సంచార మెడికల్ యూనిట్ వాహనం ప్రారంభం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం లైవ్ టెలికాస్ట్ విధానం ద్వారా ప్రారంభించారని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, నోడల్ అధికారి వీ.సీతారాం, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నీళ్లు, ఆరోగ్యం, విద్యుత్, గృహ నిర్మాణం వంటి సౌకర్యాల కల్పనకు ఈ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకంలో భాగంగా జిల్లాకు కేటాయించిన సంచార మెడికల్ యూనిట్ వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలో 21 గిరిజన గ్రామాల్లో గిరిజనులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ కార్డులు అందించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీటీవో పురుషోత్తం, ఏసీఎంఓ రాజమౌళి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత, వైద్యాధికారి అనిల్, పర్యవేక్షకులు విశ్వేర్‌రెడ్డి, డీపీవో ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బొక్క వెంకటేశ్వర్లు, గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గిరిజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి'


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

మందమర్రిరూరల్: తెలంగాణలోని నూతన బొగ్గు గనుల కేటాయింపు వేలం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులను వేలంపాట ద్వారా కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు అప్పగించాలని చూస్తోందని ఆరోపించారు. మందమర్రి డివిజన్‌లో శ్రావణ్‌పల్లి, కేకే–6 గనులకు వెంటనే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గనుల పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో త్వరలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దూలం శ్రీనివాస్, పలు సంఘాల నాయకులు కామిల్ల జయరావ్, పార్వతి రాజిరెడ్డి, కనికరపు అశోక్, రంజిత్‌కుమార్, మోహన్, శ్రీకాంత్, అభినవ్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపే గ్రూప్–3 పరీక్ష

- పకడ్బందీగా ఏర్పాట్లు
- అర గంట ముందే గేట్ల మూసివేత

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) గ్రూప్–3 పరీక్ష ఈ నెల 17, 18న నిర్వహించనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 15,038 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా.. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, మందమర్రిలో మొత్తంగా 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రమే పరీక్ష సామగ్రి స్ట్రాంగ్ రూంలకు చేరుకున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచనున్నారు. పరీక్షల నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, పోలీసు నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సురేందర్, రీజినల్ కోఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డిలను నియమించారు. ముఖ్య పర్యవేక్షకులు 48మందిని, అబ్జర్వర్లు 49మందిని, రూట్ ఆఫీసర్లు 9మందిని, ఫ్లయింగ్ స్క్వాడ్ 16 మందిని, ఐడెంటిఫికేషన్ అధికారులు 48మందిని నియమించారు. ఇద్దరు ఏసీపీలు, నలుగురు సీఐలు, 48మంది ఎస్సైలు, 150మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, అర గంట ముందే గేట్లు మూసి వేస్తామని అధికారులు ప్రకటించారు.

గంట ముందే చేరుకోవాలి..

అభ్యర్థులు గంట ముందే చేరుకోవాలి. హాల్ టికెట్, ఒరిజనల్ ఫొటో ఐడెంటీ కార్డు (ఆధార్‌కార్డు, పాన్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు) వెంట తీసుకరావాలి. మొబైల్‌ఫోన్లు, డిజిటల్ చేతివాచ్‌లు, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలికి అనుమతించం.

– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

క్లుప్తంగా

'28న స్ట్రక్చరల్ సమావేశం'



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ప్రధాన డిమాండ్లపై చర్చించడానికి ఈ నెల 28న డైరెక్టర్ (పా) లెవల్ స్ట్రక్చరల్ సమావేశం జరుగనున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య తెలిపారు. శుక్రవారం నస్పూర్ -శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ట్రక్చరల్ సమావేశాలు జరుగక 8 ఏళ్లు అవుతుందని, సమావేశంలో కార్మికుల పెండింగ్ డిమాండ్లపై చర్చిస్తామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా, నాయకులు కొమురయ్య, నర్సింగరావు, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

17న చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 9, 13 బాల, బాలికల చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నన్నపు స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల చాణక్య ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అండర్ 9 విభాగంలో జనవరి 1, 2015 తర్వాత జన్మించిన బాలబాలికలు, అండర్ 13 విభాగంలో జనవరి 1, 2011 తర్వాత జన్మించినవారు అర్హులన్నారు. అర్హత గల ఉమ్మడి జిల్లాలోని బాల, బాలికలు ఈ నెల 16వ తేదీన సాయంత్రం 5 గంట లలోగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే వారు తమ సొంత చెస్‌బోర్డ్‌తో పాటు వయసు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 93983 93293, 62819 66588 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి

లక్ష్మణచాంద: పిచ్చికుక్క దాడిలో బాలుడు గాయపడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పత్తిపాక రమణ కుమారుడు పత్తిపాక త్రినాథ్ అనే నాలుగేళ్ల బాలుడు శుక్రవారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా పిచ్చి కుక్క దాడి చేసింది. దీంతో బాలుడి కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే బాలుడిని జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. గ్రామంలో కుక్కల స్వైర విహారం ఎక్కువైందని తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతలపేట్ గ్రామానికి చెందిన బామన్ల సాయిరాం(24) ఈ నెల 5న దుబాయ్‌లోని తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయిరాం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లి మృతి చెందిన యువకుడి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. దుబాయ్ నుంచి స్వగ్రామానికి మృతదేహం రావడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బండరాళ్ల కోసం వెళ్లి.. అనంత లోకాలకు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన సల్లోల్ల నర్సింలు(24) బండరాళ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన లక్ష్మణ్, ర్యాపని నర్సింలు, తిమ్మన్నలు కలిసి గురువారం గ్రామ శివారు గుట్ట ప్రాంతానికి బండరాళ్లను తీసుకురావడానికి ట్రాక్టర్‌తో వెళ్లారు. మధ్యాహ్నం ట్రాక్టర్‌లో బండరాళ్లు నింపే క్రమంలో నర్సింలు ప్రమాదవశాత్తు కాలుజారి వెనక్కి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య అల్లకుంట గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైళ్ల పునరుద్ధరణ



మంచిర్యాల రైల్వేస్టేషన్

- యథాతథంగా రైలు ప్రయాణం
- ప్రయాణికులకు ఊరట

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైలు పట్టాల పనులు పూర్తి చేసి రైళ్లను పునరుద్ధరించడంతో ప్రయాణికులకు ఊరట లభించింది. రామగుండం, రాఘవాపురం మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో గత మూడు రోజులుగా రైలు ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తిన విషయం తెలిసిందే. జిల్లా గుండా వెళ్లే బల్లర్షా, కాజీపేట, వరంగల్ వెళ్లే రైళ్లు రద్దు చేయడంతోపాటు మరికొన్నింటిని దారి మళ్లించారు. దీంతో ప్రయాణానికి అవరోధం ఏర్పడింది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది వేగంగా ట్రాక్ పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. రెండు రోజులపాటు రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ పనులు పూర్తి చేశారు. దీంతో బుధవారం రాత్రి వరకు దెబ్బతిన్న చోట మూడు ట్రాక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో యథావిధిగా ప్రయాణం తిరిగి మొదలైంది. ప్యాసింజర్ రైళ్లతోపాటు గూడ్స్ రైళ్లు నడిపిస్తున్నారు. మొదట కొంత ఆలస్యంగా నడిచినప్పటికీ శుక్రవారం వరకు అన్ని రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రోజువారీగా ప్రయాణం సాగించే ఉద్యోగులు, వ్యాపారులకు ఊరట కలిగింది.

తెలియని కారణం?

ప్రమాదం జరిగిన తీరుపై ఇప్పటికీ స్పష్టమైన కారణం తెలియకపోవడంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. గూడ్స్ రైలు ప్రమాదం ఎందుకు జరిగిందనేది ఇప్పటికీ ఇంజనీరింగ్ అధికారులకు సహేతుక కారణం దొరకలేదు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదికలోనూ ఇదే పంపించే అవకాశం ఉంది. ప్రమాద ఘటనపై బాధ్యులను గుర్తించి ఆ మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనిపై సేఫ్టీ కమిటీ నిర్ధారించాల్సి ఉంది. మరోవైపు రైల్వేలో సిబ్బందికి పని ఒత్తిడి, ట్రాక్ పనుల బాధ్యత అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పర్యవేక్షణ, ఓవర్ లోడ్ తదితర కారణాలు ప్రమాదానికి కారణంగా అనుమానిస్తున్నారు. ప్యాసింజర్ ట్రైన్‌కు కాకుండా గూడ్స్ రైలుకు జరగడంతో పెను ముప్పు తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్‌లో మరోమారు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

పడవ ప్రయాణం.. ప్రమాదకరం!



తాంసి: పెన్‌గంగ నదిపై వారధి లేక రాకపోకలకు నాటుపడవలను ఆశ్రయిస్తూ భీంపూర్ మండలవాసులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. భీంపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పెన్‌గంగ నదికి అవలి వైపున ఉన్న మహారాష్ట్రకు నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. నదిని దాటడానికి వంతెన లేకపోవడంతో నాటుపడవల్లో వెళ్తుంటారు. శుక్రవారం వడూర్ గ్రామశివారులో నాటుపడవలో ద్విచక్ర వాహనాన్ని ఎక్కించి నదిని ప్రమాదకరంగా దాటుతుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- కాలి బూడిదైన 25 క్వింటాళ్ల పత్తి
- రూ.5 లక్షల వరకు నష్టం



పూర్తిగా దగ్ధమైన ఇల్లు

వాంకిడి: అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలోని ఇందాని గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందాని గ్రామానికి చెందిన చాప్లె ప్రకాశ్ అతని భార్యతో కలిసి శుక్రవారం ఉదయం పొలంలో పత్తి ఏరడానికి వెళ్లాడు. వారి 5 సంవత్సరాల కూతురు, 2 సంవత్సరాల కుమారుడిని పక్కనే ఉంటున్న నాన్నమ్మ ఇంట్లో వదిలి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరు. ఈక్రమంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో అకస్మాత్తుగా పొగలు కమ్ముకోవడంతో చుట్టుపక్కల వారు గమనించి నిప్పులు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ గత వారం రోజులుగా ఏరిన పత్తి ఇంట్లోనే నిల్వ ఉండటం.. ఫైరింజన్ రావడంలో ఆలస్యం జరగడంతో మంటలు తీవ్రంగా చెలరేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. రెండు మేక పిల్లలను ఇంట్లోనే కట్టేసి వెళ్లగా మంటలు చెలరేగే సమయంలో స్థానికులు బయటకు తీశారు. ఇంట్లో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన 25 క్వింటాళ్ల పత్తి, రూ.లక్ష నగదు, ఒకటిన్నర తులాల బంగారం, 12 తులాల వెండి, రెండు బెడ్లు, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయని దంపతులు వాపోయారు. సుమారు రూ.5 లక్షల కంటే ఎక్కువ నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా విద్యుత్ షాక్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'డయల్ యువర్ ఆర్ఎం'కు స్పందన

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజియన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి స్పందన లభించింది. రీజినల్ మేనేజర్ సోలోమన్ ప్రయాణికుల నుంచి ఫోన్ ద్వారా వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపాలని, ఆసిఫాబాద్ రూట్‌లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు వేయాలని, ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వయా కడెం మీదుగా మరిన్ని సర్వీసులు నడపాలని, సాయంత్రం వేళలో ఆదిలాబాద్ నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక సర్వీస్‌లు వేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఆర్ఎం అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని ప్రయాణికుల సమస్యలు, విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిష్కరిస్తామని వెల్లడించారు.

కొత్తపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని వినతి

భీమారం: మండల కేంద్రం నుంచి కొత్తపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు అనుమోల్ల అశోక్, చిలకాని కనకయ్య, బోయిరి లక్ష్మణ్ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఆరెపల్లి, మద్దికల్, ఎలకేశ్వరం, తాళ్లగూడెం గ్రామాల మీదుగా కొత్తపల్లి వరకు బస్సు నడిపిస్తే మండల ప్రజలకు ప్రజారవాణా అందుబాటులోకి వస్తుందని వివరించారు.

విద్యార్థులు ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి

భైంసా: విద్యార్థులు ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ డా. మురళీధర్శన్ అన్నారు. శుక్రవారం బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రతికూల పరిస్థితులను ఎలా అధిగమించాలో అనే అంశంపై కాన్ఫరెన్స్‌హాల్‌లో పీయూసీ విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును రూపొందించే సామర్థ్యాన్ని కలిగి ఉండాలన్నారు. చిన్న విషయాలకే ధైర్యాన్ని కోల్పోకూడదని తెలిపారు. ఈ దశ నుంచే స్ఫూర్తిదాయకమైన నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదల తదితర అంశాలను అలవర్చుకోవాలన్నారు. అనునిత్యం కొత్త ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, పలువురు డీన్‌లు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ర్యాపన సాయినాథ్(25) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నైలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... ర్యాపన సాయినాథ్ గత కొన్ని రోజులుగా కంటి నొప్పితో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం కంటి చికిత్స కోసం ముథోల్ కంటి ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆయన కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని కన్పించాడు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కారు ఢీకొట్టి యువకుడు..



అరుణ్ (ఫైల్)

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బొమ్మిడి అరుణ్‌కుమార్(26) అనే యువకుడు కారు ఢీకొని మృతిచెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. అరుణ్‌కుమార్ తన స్నేహితులు దినకర్, విష్ణు, మహేశ్‌లతో కలిసి రోజూ మాదిరి శుక్రవారం మార్నింగ్ వాక్‌కు వెళ్లాడు. కొత్తూరు గ్రామ స్టేజీ సమీపంలో జన్నారం నుంచి లక్సెట్టిపేటకు వెళ్తున్న కారు యువకుడిని వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో కాలు విరిగి తలకు బలమైన గాయమై అరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, మహేశ్‌కు గాయాలయ్యాయి. అరుణ్‌కుమార్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా, తమ్ముడు తరుణ్ హైదరాబాద్‌లో పీజీ చదువుతున్నాడు. మృతుడి తల్లి మంజులత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న మంచిర్యాల లైన్స్‌క్లబ్ సభ్యులు అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్ర దానం చేయడానికి ఒప్పించారు. వైద్యాధికారి అభిషేక్ సహకారంతో నేత్రాలలోని కార్నియాను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించినట్లు లైన్స్‌క్లబ్ నిర్వాహకుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్యకు గాయాలయ్యాయి. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం ఎర్రగుంటపల్లెకు చెందిన కోట సాంబశివరావు(66), శివపార్వతి దంపతులు ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా గద్దెరాగిడి వైన్స్ షాపు వద్ద ఓ అంబులెన్స్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సాంబశివరావు మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు.. పలువురికి గాయాలు

బైక్ అదుపుతప్పడంతో..



గాయపడిన తిరుమన్‌రావు

తిర్యాణి: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొర్రిగూడ పంచాయతీ పరిధిలోని లచ్చుగూడ గ్రామానికి చెందిన కోర్వెత తిరుమన్‌రావు బైక్‌పై తిర్యాణి నుంచి మొర్రిగూడ వైపునకు వెళ్తుండగా పాత సమ్మక్క గద్దెల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముథోల్‌లో..

ముథోల్: మండల కేంద్రంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రహ్మన్‌గావ్ గ్రామానికి చెందిన భూమన్న అనే వ్యక్తి ముథోల్ వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలో ఒక్కసారిగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో భూమన్నకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, అంబులెన్సు టెక్నీషియన్ మాధవ్, పైలట్ గౌతమ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం భైంసా ఏరియాసుపత్రికి తరలించారు.

ఆటో ఢీ కొట్టడంతో ఒకరికి..

ముథోల్: మండలంలోని బాసర -భైంసా ప్రధాన రహదారిపై చార్‌బాయి బీడీ కంపెనీ సమీపంలో ఆటో ఢీకొన్న సంఘటనలో మహిళకు తీవ్ర గాయాలైనట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బాసర మండల కేంద్రానికి చెందిన లక్ష్మి గురువారం రాత్రి నడుచుకుంటూ బాసర వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై కాలు విరిగిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్‌లో లక్ష్మిని భైంసా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు బాధితురాలి భర్త ముత్తన్న తెలిపారు. ముత్తన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సర్వేలో 'వలస' ప్రశ్నలు

- ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి సమాచారం సేకరణ
- సంక్షేమం కోసమే అంటున్న గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు
- పూర్తి సమాచారం ఇవ్వాలని సూచన



సర్వేలో వలస వెళ్లిన వారి వివరాలకు సంబంధించిన ప్రశ్నల విభాగం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో సామాజిక, ఆర్థిక, కుల గణన కోసం ఇంటింటి సమగ్రసర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఇందులో దాదాపు 56 కాలమ్స్‌లలో ప్రధాన ప్రశ్నలు ఉండగా, అందులోని ఉపప్రశ్నలతో కలిపి మొత్తం 75 వరకు ప్రశ్నావళితో కుటుంబం సమగ్ర వివరాలను సేకరించి పొందుపరుస్తున్నారు. ఈ మేరకు నిర్మల్ జిల్లాలోనూ ఎన్యూమరేటర్లు సమాచారాన్ని సేకరించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాట పడుతున్న కార్మికుల సంఖ్య గణనీయంగా ఉంది. గల్ఫ్ కుటుంబాల సమస్యలను సర్వే ద్వారా తెలుసుకునేందుకు ప్రశ్నావళిలోని 48, 48(బి), 48(డి) ప్రశ్నల ద్వారా ఏ దేశానికి వలస వెళ్లారు...? వెళితే ఆ దేశం పేరు...? వలస వెళ్లడానికి ప్రధానమైన కారణం..? వంటి ప్రశ్నలకు ఆయా కుటుంబాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు.


గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం..

సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ కుల గణన కోసం చేపడుతున్న ఇంటింటి సర్వేలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు సమాచారాన్ని ఇవ్వడం ద్వారా రానున్న రోజుల్లో వారి సంక్షేమ కోసం ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉందని గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఉన్న ఊరిలో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పాటు, స్వీయ వ్యవసాయ భూకమతాలు లేకపోవడం కారణాలుగా గల్ఫ్ దేశాలను వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెబుతున్నారు. సమగ్ర సర్వే ద్వారా పూర్తి సమాచారం నివేదిక రూపంలో అందుబాటులోకి వస్తే, తద్వారా గల్ఫ్ కార్మికుల సంఖ్య స్పష్టమవుతుంది.

రాష్ట్రాలు, దేశాలకు వేర్వేరుగా..

జిల్లాలోని పేద, మధ్య తరగతికి చెందిన చాలామంది తమ స్వస్థలాల నుంచి వివిధ కారణాల రీత్యా ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలస వెళ్తున్నారు. అలా వెళ్లినవారు పూర్తి సమాచారాన్ని సమగ్ర సర్వేలో అందించాల్సి ఉంటుంది. తమ కుటుంబ సభ్యులలో ఇతర దేశాలకు వలస వెళితే 48(ఏ)వ ప్రశ్నలో కోడ్ నంబర్ 1, ఇతర రాష్ట్రాలకు వెళితే కోడ్ నంబర్ 2 గా గుర్తించాల్సి ఉంటుంది. అందులో ఏ దేశానికి వెళ్లింది కూడా తెలియజేయాల్సి ఉంటుంది. ఇక 48(బి) ప్రశ్నలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లితే కోడ్ నంబర్ 04 గా గుర్తించాలి.

పూర్తి సమాచారం ఇవ్వాలి



ప్రస్తుతం చేపడుతున్న సర్వేలో వివిధ గల్ఫ్ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినవారు లేదా వివిధ కారణాల రీత్యా తిరిగి వచ్చిన వారు సమగ్ర సర్వేలో ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్ల ప్రశ్నలకు పూర్తి సమాచారం అందివ్వాలి. తద్వారా రానున్న రోజుల్లో గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరేందుకు అవకాశం ఉంటుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు, నిర్మల్

మాజీ ఎంపీపీపై యువకుల దాడి



గాయాలతో కిందపడిన లక్ష్మణ్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో శుక్రవారం కౌటాల మాజీ ఎంపీపీ కుమ్మరి లక్ష్మణ్‌పై దాడి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన ప్రశాంత్, సాయి అనే ఇద్దరు యువకులు బాబాసాగర్ గ్రామంలోని ప్రధాన రహదారిపై లక్ష్మణ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని అడ్డుకుని దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా యువకులు విన్పించుకోలేదు. దీంతో గ్రామస్తులు యువకులకు దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కుమ్మరి లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేసు నమోదు చేయలేదని తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే యువకులు మాజీ ఎంపీపీపై దాడికి పాల్పడినట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరి కిషన్ సోనీ జ్యూవెలర్స్ మంచిర్యాల బ్రాంచ్‌లో పనిచేయుటకు సేల్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. ఆకర్షణీయమైన వేతనం. ఇంటర్వ్యూ తేది: 19-11-24, సెల్: 9134916916, 9154533082 [K-1253263]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253917]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. ఫోన్: 9912011899, 9912011499 [SCA24000626]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462



మద్యం అనుకొని గడ్డిమందు తాగి వ్యక్తి మృతి



ఇజ్రాయిలు మృతదేహం

ముథోల్: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఇంట్లో ఉన్న గడ్డి మందును మద్యం అనుకొని తాగి మృతి చెందిన సంఘటన మండలంలోని కారేగాంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇజ్రాయిలు (42) తన భార్య మరియమ్మతో కలిసి భవన కూలీగా జీవిస్తూ ముథోల్ మండలం కారేగాంలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం మద్యం తాగి ఇంటికి వచ్చిన ఇజ్రాయిలు మద్యం మత్తులో అద్దె ఇంట్లో ఉన్న గడ్డిమందును మద్యం అనుకొని తాగి విషయాన్ని భార్యకు చెప్పాడు. అనుమానం వచ్చిన భార్య మరియమ్మ గడ్డిమందు సీసాను ఇంటి యజమానికి చూపించగా గడ్డిమందు అని ఆయన తెలపడంతో వెంటనే ఇజ్రాయిలును భైంసా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు గేదెలు బలి

మందమర్రిరూరల్: మండలంలోని దుబ్బపల్లి సమీపంలో విద్యుత్ తీగలు అమర్చిన వేటగాళ్ల ఉచ్చుకు తగిలి గేదెలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మందమర్రిలోని షిర్కే నివాసి ఇందూరి శంకర్‌కు చెందిన రెండు గేదెలు బుధవారం ఉదయం మేత కోసం వెళ్లాయి. గేదెలు ఇంటికి తిరిగి రాకపోవడంతో గాలించాడు. శుక్రవారం దుబ్బపల్లి సమీపంలో గేదెలు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. గేదెల విలువ సుమారు. రూ.2లక్షల వరకు ఉంటుందని బాధితుడు శంకర్ తెలిపారు. వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చిన ప్రాంతంలో గేదెలతో పాటు మరికొన్ని జీవాలు కూడా మృతి చెందిన ఆనవాళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌బీవో రాజేశ్వరిని వివరణ కోరగా తనకు సమాచారం లేదన్నారు.